



19వ వసంతంలోకి ...

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 31 డిసెంబర్ 2025 పేజీలు 8


# ప్రగతి నావ పయనాన్ని పరుగులు పెట్టిద్దాం..

- విశ్లేషించుకుంటూ వినూత్నంగా ముందడుగు వేద్దాం..
- ప్రతి కీలక ప్రగతి సూచికనూ ఏం గ్రేడ్‌కు తీసుకెళ్లాలి
- స్వర్ణాంధ్ర దార్శనిక ప్రణాళికల స్ఫూర్తిని మరవొద్దు
- జీడీడీపీ, తలసరి ఆదాయ వృద్ధి లక్ష్యాలపై దృష్టిసారిద్దాం
- అధికారులతో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**ఎన్‌టీఆర్ జిల్లా, డిసెంబర్ 30, మేజర్ న్యూస్ :** ఏడాది కాలంలో సమష్టి కృషితో ఎన్నో విజయాలను సొంతం చేసుకున్నామని.. ఈ ప్రగతి పథం స్ఫూర్తిగా ఇకపైనా సరైన విశ్లేషణతో వినూత్నంగా జిల్లా సమగ్రాభివృద్ధికి ముందడుగు వేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి కీలక ప్రగతి సూచికల(కేపీఐ)తో పాటు జిల్లా అభివృద్ధికి, ప్రజల క్షేమం, సంక్షేమానికి ఏడాది కాలంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలు, సాధించిన విజయాలు, వాటి స్ఫూర్తితో కొత్త ఏడాది కార్యాచరణపై సమీక్షించారు. 12 నెలల కాలంలో మైలురాళ్లను గుర్తుకు తెస్తూ వచ్చే ఏడాదిలో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ముందుకెళ్లాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మిగతా 2లో




## నిధుల మళ్లింపుపై గ్రామస్తుల ఆగ్రహం

ఇండస్ట్రియల్ నిదులను స్వాహాపై గ్రామస్తుల ఆగ్రహం

సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అనే చందాన ఉంది నిధులు మళ్లింపు

వివరాలు 2 లో

## పిపిపి విధానంలో అదనంగా 100 వైద్య సీట్లు



- సూపర్ సిక్స్ పథకాల అమలులో ముందడుగు
- అన్న క్యాంటీన్ ద్వారా నాలుగు కోట్ల మందికి భోజనం
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

వివరాలు 7లో...

## పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ : పరిశ్రమల ఏర్పాటు కోసం భూ కేటాయింపులు జరిగి అనుమతులు మంజూరు చేసిన యూనిట్ల 2లో..

### అవరోధాలను అవకాశాలుగా మల్చటం

## సీఎం చంద్రబాబుకే సాధ్యం

ఏడాదిన్నర పూర్తయ్యేలోపే సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ సాధించింది

టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడి

ఎన్డీయే కూటమి ఏడాదిన్నర పాలన పై మీడియా సమావేశం



**విజయవాడ మేజర్ న్యూస్ :** అవరోధాల నుంచి అవకాశాలను వెతుక్కునే వారిలో చంద్రబాబు నాయుడు ముందుంటారు. అలా అవకాశాలు సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించటం సీఎం చంద్రబాబు కే సాధ్యమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ అన్నారు. ఏడాదిన్నర కాలంలో ఎన్డీయే కూటమి సాధించిన విజయాలపై ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు మంగళవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ షిబ్లీ, రాష్ట్ర ఆర్గానిక్ ఉత్పత్తుల సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ సావల దేవదత్, రాష్ట్ర బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల. రఘు రామరాజు, రాష్ట్ర నాగ వంశం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు, రాష్ట్ర సామాజిక సంక్షేమ మండలి చైర్మన్ పోతుల బాల కోటయ్య పాల్గొన్నారు. 2

(మొదటిపేజీ తరువాయి)



## పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం పెనమలూరు నియోజకవర్గంలోని కానూరు 100 అడుగుల రోడ్డులోని అన్నే వారి కళ్యాణ మండపంలో జిల్లా లోని పారిశ్రామికవేత్తలు, అధికారులను ఒక వేదిక వద్దకు చేర్చి పారిశ్రామికవాడల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. పారిశ్రామికవేత్తలు చెప్పిన సమస్యలను ఆయన ఓపిగ్గా ఆలకించి, పరిష్కరించగలిగిన వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. జిల్లా పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, పరిధిలో లేనివి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పారిశ్రామికవాడలలో మౌలిక వసతులు కల్పించి పలు ప్రభుత్వ రాయితీలను అందించి ప్రోత్సహిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పారిశ్రామికవేత్తలకు ఉన్న సమస్యలను రాతపూర్వకంగా తెలియజేయాలని, తద్వారా వాటిని పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపిస్తామన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం ప్రతి 20 మంది వ్యాపారవేత్తలకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామని, వారిచ్చే నివేదిక ఆధారంగా తరచుగా ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. మల్లవల్లి, వీరప్పనేనిగూడెంలో పారిశ్రామికవాడల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని పలు పారిశ్రామికవేత్తలు ఈ సందర్భంగా కోరారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచిస్తూ, వాటి నిర్వహణ బాధ్యతలను ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సిబ్బందికి నివాస భవనాలు (క్వార్టర్స్) నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరగా, సమీపంలో ప్రభుత్వ భూములను పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. సేల్ డీడ్ అగ్రిమెంట్ పత్రాలు ఉన్నప్పటికీ ఆర్థిక అవసరాల కోసం బ్యాంకులను సమీపిస్తే రుణాలు మంజూరు చేయడంలేదని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సూచించారు. సమావేశంలో గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్ వెంకట్రావు, మల్లవల్లి పారిశ్రామికవాడ చైర్మన్ జి రవికుమార్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిధుల మళ్లింపు పై ఆ గ్రామస్తులు ఆగ్రహం

**ఇండస్ట్రియల్ నిదులను స్వాహా పై గ్రామస్తులు ఆగ్రహం....**

**సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అనే చందాన ఉంది నిధులు మళ్లింపు.....**

**జగ్గయ్యపేట : డిసెంబర్ 30 మేజర్ న్యూస్ :** మండలంలోని తిరుమలగిరి గ్రామ పంచాయితీ ఏర్పడి 5 సంవత్సరాలు అయినప్పటికీ ఆ గ్రామానికి చెందిన ఇండస్ట్రియల్ ఇన్ఫ్రా స్ట్రెక్చర్ (ఏపీఐఐసీ) నిధులను చిల్లకల్లు గ్రామపంచాయతీ వారు మోసపూరితంగా వ్యవహరించి సాటి పంచాయితీ నిధులను స్వాహా చేసి చిల్లకల్లు పంచాయితీకి వినియోగించడం పట్ల తిరుమలగిరి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో చిల్లకల్లు పంచాయతీ గా ఉన్న తిరుమలగిరి గ్రామం 2020లో ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పడినప్పటికీ గత ఐదు సంవత్సరాల నుండి ఆ గ్రామ పంచాయితీకి చెందవలసిన ఏపీఐఐసీ నిధులను సుమారు కోటి రూపాయలను ఆ గ్రామ అభివృద్ధికి వినియోగించకుండా చిలకల్లు గ్రామ పంచాయతీకి వినియోగించడం జరుగుతుందని వారు ఆరోపించారు. స్పెషల్ ఆఫీసర్గా ఉన్న ఎంపీడీవో సహాయంతోనే చిలకల్లు గ్రామపంచాయతీ సెక్రటరీ సంవత్సరానికి సుమారు 75 వేల రూపాయల నుండి లక్ష రూపాయల వరకు నిధులను ఏపీఐఐసీ నుంచి వచ్చిన నిధులను దారి మళ్లించి తిరుమలగిరి గ్రామపంచాయతీ వారికి తెలియకుండా చిల్లకల్లు గ్రామపంచాయతీకి ఉపయోగిస్తున్నట్లు తప్పుడు రికార్డులను తయారుచేసి ఆ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. ఈ విధంగా సొమ్ము ఒకరిది సోకు మరీ ఒకరిది అనే చందాన ఉంది తిరుమలగిరి గ్రామపంచాయతీ ఏపీఐఐసీ నిధుల స్వాహా అని ప్రజలు విమర్శిస్తున్నారు. కావాలనే ఉద్దేశపూర్వకంగా నిధులను దారి మళ్లించి తిరుమలగిరి గ్రామపంచాయతీ అధికారులను ప్రజలను మోసం చేసిన మండల, చిల్లకల్లు గ్రామపంచాయతీ అధికారుల పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుని తిరుమలగిరి గ్రామ పంచాయతీకి రావాల్సిన నిధులను రికవరీ చేయాలి అని పంచాయతీకి చెందిన దర్శి నరసింహారావు జిల్లా ఉన్నతాధికారులను కోరారు. అలాగే తిరుమలగిరి గ్రామం పంచాయతీ నిధులు మళ్లింపు దుర్వినియోగం మోసంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు.

# ప్రగతి నావ పయనాన్ని పరుగులు పెట్టిద్దాం..






(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రాధాన్యాతలకు అనుగుణంగా, స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరుకునే క్రమంలో సంక్షేమ పథకాల సమర్థ అమలుతో పాటు అన్ని రంగాల్లోనూ అభివృద్ధిని కాంక్షిస్తూ చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించామని.. కేపీఐలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. యోగాంధ్ర సందర్భంగా ప్రపంచ రికార్డుల నమోదు, స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయస్థాయి పురస్కారాలు, ఆకాంక్షిత బ్లాకుల అభివృద్ధి సూచికల్లో నీతి ఆయోగ్ బంగారు పతకాలు.. ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఎన్నో గుర్తింపులు సాధించామన్నారు. భారీ కార్యక్రమాలతో పాటు దసరా ఉత్సవాలు, విజయవాడ్ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించి టీమ్ ఎన్‌టీఆర్ గౌరవ సీఎం ప్రశంసలు సైతం అందుకుం దన్నారు. వీటిని స్ఫూర్తిగా తీసుకొని కొత్త ఏడాదిలోనూ జీడీడీపీ, జీవీఏ, తలసరి ఆదాయం వంటి ఆర్థిక సూచికల్లోనూ లక్ష్యాలను చేరుకునేందుకు కృషిచేద్దామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**ప్రతి సూచికలోనూ ఏం మన లక్ష్యం**

ప్రతి కీలక ప్రగతి సూచికలో (కేపీఐ)లో ఏం గ్రేడ్ మన లక్ష్యమని.. సాధించిన స్కోరు ప్రకారం నవంబర్ వరకు చూస్తే ఎ.కొండూరు మండలం 129 సూచికల్లో 92 స్కోరుతో, నందిగామ 136 సూచికల్లో 90 స్కోరుతో, తిరువూరు 124 సూచికల్లో ఏ ప్లస్ గ్రేడ్ సాధించాయని తెలిపారు. ప్రతి మండలం, ప్రతి సూచికలోనూ ఏ ప్లస్ గ్రేడ్‌ను చేరుకునేందుకు మరింత కృషిచేయాలని సూచించారు. ఈ సూచికలపై ప్రతి శాఖా ప్రత్యేకంగా దృష్టిసారించి సమీక్షించుకుంటూ ప్రగతి దిశగా పయనించాలన్నారు. వ్యవసాయ రుణాలు, ప్రకృతి సాగు విస్తీర్ణం, పంటల బీమా, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం వంటి అంశాలపై దృష్టిసారించాలన్నారు. పశువుల షెడ్లు, పాడి అభివృద్ధి, ఎంఎస్ఎంఈల రిజిస్ట్రేషన్, వసతి గృహాల్లో విద్యార్థుల నమోదు, రహదారుల నిర్మాణం, పునరుద్ధరణ, స్వచ్ఛతా పథకాలు, కార్యక్రమాల అమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఆరోగ్య కార్యక్రమాల అమలు తదితరాలకు సంబంధించిన సూచికలపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన తదితర రంగాలలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో సీపీవో వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్పీడ్ ఆఫ్ డూయింగ్‌తో చేయూత..

**ఎన్‌టీఆర్ జిల్లా, డిసెంబర్ 30, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ దార్శనికతతో పాటు ముఖ్యమంత్రి ఆకాంక్షలు అయిన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త నినాదాలకు అనుగుణంగా జిల్లాలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి చొరవ చూపుతున్నామని.. పెట్టుబడిదారులకు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ.. ఇటీవల విశాఖపట్నం పార్ట్నర్‌షిప్ సమ్మిట్-2025 సందర్భంగా అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) కుదుర్చుకున్న పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ ఒప్పందాలకు కార్యరూపమిచ్చి ప్రగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహాయసహకారాలపై చర్చించి పటిష్ట ప్రణాళిక ప్రకారం కార్యాచరణకు ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూ సంబంధిత అంశాలపైనా సమావేశంలో చర్చించారు. విజయవాడ, నందిగామ, తిరువూరు డివిజన్ల పరిధిలో ల్యాండ్ బ్యాంకు వివరాలతో సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలని ఆర్‌డీవోలకు సూచించారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం కల్పించాలని ఆదేశించారు. నిరంతర సమీక్షల ద్వారా లోటుపాట్లను సవరించుకుంటూ ముందుకెళ్లాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. ప్రత్యేక సమావేశాల వల్ల పరిశ్రమల స్థాపనకు భూమి సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు.. అధికారులు-పరిశ్రమల మధ్య సమన్వయం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలను విస్తృతం చేయడం, జిల్లా స్థూల ఉత్పత్తి వృద్ధి తదితర లక్ష్యాలకు అనుగుణంగా పారిశ్రామిక రంగ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాంకో సిమెంట్స్, అమరావతి బోటింగ్ క్లబ్, నవతరం సినీ స్టూడియోస్ తదితర సంస్థలకు చెందిన పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. అలాగే ఈ సమావేశంలో ఏపీఐఐసీ, జిల్లా పరిశ్రమల కేంద్రం, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# అవరోధాలను అవకాశాలుగా మల్చటం సీఎం చంద్రబాబుకే సాధ్యం



(మొదటిపేజీ తరువాయి)

ఈ సమావేశానికి ముందు టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన గద్దె అనురాధ, ప్రధానకార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏడాదిన్నర పూర్తయ్యే లోపు సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం సూపర్ 6 పథకాలు సూపర్ హిట్ చేసి చూపిందన్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వం అనే పలకరింపు, అభినందనలు ప్రజలు నంచి వస్తున్నాయన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10, 090 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. స్త్రీ శక్తి పథకం ఆగస్టు 15 నుంచి ప్రారంభించగా ఇప్పటి వరకు అయిన వ్యయం రూ.1.444 కోట్లు కాగా, 3.25 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారని తెలిపారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం...ఎక్కడైనా పింఛను తీసుకునే సౌకర్యం కల్పించటం జరిగందన్నారు. అన్నదాత సుఖీ భవ పథకం ద్వారా 46 లక్షల మంది రైతులకు రూ.6.310 కోట్లు రైతుల ఖాతాల జమ చేయటం జరిగిందన్నారు. ఇలా పెన్షన్స్, ఉచిత గ్యాస్ సిలిండర్స్, ఇమామ్, మౌజమ్స్, పాస్టర్స్ కి, డ్రైవర్లకు పదిహేనువేలు, గీతకార్మికులకు సహాయం ఇలా ఎన్నో చేసినట్లు వివరించారు. ముఖ్యమంత్రి తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ ద్వారా 15 వేల 941 టీచర్ల పోస్టుల భర్తీ అయ్యాయని, 5,757 కానిస్టేబుల్ పోస్టులు నియమాకం కూడా పూర్తి చేయటం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకువచ్చి దాదాపు ఎనిమిదిలక్షల ఉద్యోగాలు సాధించేలా ముందడుగు వేయటం జరిగిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు కలకలంగా వుండాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం హడావుడిగా నిర్ణయాలు తీసుకోదని, జనగణన పూర్తి అయిన తర్వాత గ్రేటర్ విజయవాడ పై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. గ్రేటర్ విజయవాడ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని స్పష్టంచేశారు. గద్దె అనురాధ మాట్లాడుతూ గత ప్రభుత్వం విధ్వంసం వైపు రాష్ట్రాన్ని తీసుకువెళ్లితే సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం వికాసం నడుస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి చూసి సహించలేక వైకాపా నాయకులు మాట్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వం పేదలకు అన్నం పెట్టే అన్నక్యాంటీన్లు మూసివేస్తే....ఎన్డీయే కూటమి అధికారంలో వచ్చిన తర్వాత ప్రతి నియోజకవర్గంలో ఒక అన్నక్యాంటీన్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. వైకాపా ప్రభుత్వం రాష్ట్ర ఖజనాను ఖాళీ చేసిందని అయినా రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లటం జరుగుతుందన్నారు. రైతులను ఏ మాత్రం ఇబ్బంది పెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం పంటను కొనుగోలు చేసి రైతుల ఖాతాలో నగదు జమ చేయటం జరుగుతోందన్నారు. రాబోయే సంక్రాంతి రైతులకు నిజమైన సంక్రాంతి పండుగ అని తెలిపారు. టిడిపి ఎప్పుడు మహిళలకు పెద్ద పీట వేస్తోందన్నారు. ఉచిత బస్సు సౌకర్యంతో మహిళలు ఎంతో ఆనందంగా వున్నారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆశ్చర్యపడే విధంగా రాష్ట్రానికి గూగుల్ సీఎం చంద్రబాబు తీసుకురావటం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రైమ్ రేట్ కూడా బాగా తగ్గిందని, గంజాయి, డ్రగ్స్‌ను కూడా అరికట్టడం జరిగిందన్నారు. కొండపల్లి మున్సిపాల్ చైర్మన్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు మాట్లాడుతూ తనకి ఈ అవకాశం కల్పించిన టిడిపి జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపీకేశినేని శివనాథ్ లకు ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్ఎస్ఈ వార్షిక హైలైట్స్ 2025

**మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.469 లక్షల కోట్లకు చేరుకోగా, ఫండ్ మొబిలైజేషన్ రూ.19.17 లక్షల కోట్లను దాటింది**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఇ) 2025 క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించిన తన వార్షిక ముఖ్యాంశాలను విడుదల చేసింది (డిసెంబర్ 19, 2025 వరకు నవీకరించబడిన డేటాతో). ప్రపంచ స్థూల-ఆర్థిక అస్థిరత కొనసాగుతున్నప్పటికీ, ఈ నివేదిక ఈక్విటీ మార్కెట్లు, మూలధన సమీకరణ, పెట్టుబడిదారుల పాల్గొనడం, అంతర్జాతీయ కార్యకలాపాల్లో ఎన్ఎస్ఇ సాధించిన స్థిరమైన వృద్ధిని ప్రదర్శిస్తుంది.

**మార్కెట్ పనితీరు, క్యాపిటలైజేషన్**

నిఫ్టీ 50 ఇండెక్స్ డిసెంబర్ 31, 2024 న ఉన్న 23,645 స్థాయి నుండి 25,966 కు చేరుకుని, సీవై2025 లో 9.8% వృద్ధిని నమోదు చేసింది. అదే సమయంలో, ఎన్ఎస్ఇలో లిస్టైన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.439 లక్షల కోట్ల నుంచి రూ.469 లక్షల కోట్లకు పెరిగి, 6.8% వృద్ధిని ప్రతిబింబించింది. మార్కెట్ క్యాప్-టు- జీడిపి నిష్పత్తి 136% వద్ద స్థిరంగా కొనసాగుతూ, వై-ఓ-వై స్థిరమైన ఆర్థిక ప్రాతిపదికను సూచించింది.

**నిధుల సమీకరణ, ప్రాథమిక మార్కెట్లు**

ఈక్విటీ, డెట్, బిజినెస్ ట్రస్ట్ ద్వారా మొత్తం ఫండ్ సమీకరణ రూ.19.17 లక్షల కోట్లకు చేరుకుని, 2024లోని రూ.17.89 లక్షల కోట్లతో పోలిస్తే 7% వృద్ధి నమోదు చేసింది. మొత్తం ఈక్విటీ సమీకరణ రూ.4.12 లక్షల కోట్లుగా ఉంది. రుణ సమీకరణ రూ.14.72 లక్షల కోట్లకు పెరిగి, 10% వృద్ధిని ప్రతిబింబించింది. ప్రాథమిక మార్కెట్లు బలంగా కొనసాగగా, 101 మెయిన్‌బోర్డ్ ఐపీఓలు కలిసి రూ.1.71 లక్షల కోట్లను సమీకరించాయి. 112 ఎస్ఎంఈ ఐపీఓలు మొత్తం రూ.5,589 కోట్లను సమీకరించాయి. మహారాష్ట్ర, ఢిల్లీ-ఎన్సిఆర్, కర్ణాటక రాష్ట్రాలు 2025లో ఐపీఓ కార్యకలాపాల్లో అగ్రస్థానాల్లో నిలిచాయి.

**ద్వితీయ మార్కెట్లు & గ్లోబల్ స్టాండింగ్**

ఎన్ఎస్ఈ ఈక్విటీ డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా నెం.1 స్థానాన్ని నిలబెట్టుకుంది, గ్లోబల్ కాంట్రాక్టులలో 53.2% వాటాతో ఆధిపత్యం చెలాయించింది. ఎన్ఎస్ఈ 16.2 శాతం గ్లోబల్ వాటాతో కొత్త లిస్టింగ్లలో ప్రపంచవ్యాప్తంగా 2వ స్థానంలో నిలిచింది. ఏటిసి, ఆర్ఎఫ్ క్యూ విభాగాలలో కార్పొరేట్ బాండ్ ట్రేడింగ్ గణనీయమైన వృద్ధిని నమోదు చేసింది, ఆర్ఎఫ్ క్యూ టర్నోవర్ సంవత్సరానికి 52.6% పెరిగింది.

**పెట్టుబడిదారుల భాగస్వామ్యం & గృహ సంపద సృష్టి**

25వ ఆర్థిక సంవత్సరంలో 1.5 కోట్ల కొత్త పెట్టుబడిదారులు చేరడంతో, మొత్తం ప్రత్యేక రిజిస్టర్డ్ పెట్టుబడిదారుల సంఖ్య 12.4 కోట్లకు పెరిగింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు నుంచి బలమైన భాగస్వామ్యంతో, పెట్టుబడిదారుల సంఖ్య సంవత్సరానికి 13.9% వృద్ధిని నమోదు చేసింది. ఏప్రిల్ 2020 నుంచి భారతీయ ఈక్విటీలలో గృహ సంపద పెరుగుదల రూ.53 లక్షల కోట్లకు చేరింది, ఇది దీర్ఘకాలిక సంపద సృష్టిలో మూలధన మార్కెట్ల పెరుగుతున్న పాత్రను స్పష్టంగా చూపిస్తుంది.

**ఎన్ఎస్ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ 9)**

ఎన్ఎస్ఈ 9 2025 ఆర్థిక సంవత్సరంలో డా.1 ట్రిలియన్ కాల్పనిక టర్నోవర్ మార్కును దాటి, మొత్తం డా.1,106 బిలియన్‌కు చేరుకుంది. గిఫ్ట్ నిఫ్టీ కాంట్రాక్టులు సివై2025లో 22.52 మిలియన్ కాంట్రాక్టుల సంచిత పరిమాణాన్ని నమోదు చేశాయి, వీటి టర్నోవర్ సుమారు యుఎస్ డా.1 ట్రిలియన్గా ఉంది. ప్రారంభం నుంచి ఇప్పటివరకు, గిఫ్ట్ నిఫ్టీ మొత్తం డా.2.53 ట్రిలియన్ సంచిత టర్నోవర్‌ను సాధించింది.

**సారాంశం :** భారత మూలధన మార్కెట్లలో పెరుగుతున్న లోతు, సుస్థిరత్వం, ప్రపంచ ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తూ, సీవై2025 ఎన్ఎస్ఈకు మరో కీలక మైలురాయిగా నిలిచింది. పెట్టుబడిదారుల భాగస్వామ్యం విస్తరించడం, బలమైన నిధుల సమీకరణ కార్యకలాపాలు, అంతర్జాతీయ మార్కెట్లలో పెరుగుతున్న ఉనికిఇవి అన్నీ కలిసి భారతదేశ ఆర్థిక పర్యావరణ వ్యవస్థలో ఎన్ఎస్ఈ ఒక ప్రధాన స్తంభంగా తన పాత్రను మరింత బలపరిచాయి.

# అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థికసాయం






**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సి)లను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని 5గురు లబ్ధిదారులకు రూ.రూ.11.40 లక్షల విలువైన ఎల్.ఓ.సిలు తాజాగా మంజూరైనట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తెలిపారు.మైలవరంకు చెందిన షేక్ మహమ్మద్ కు రూ.2 లక్షలు, జి.కొండూరు మండలం కవులూరు గ్రామానికి చెందిన కాంద్రు కోటేశ్వరరావుకు రూ 2.99లక్షలు, మైలవరంకు చెందిన సైదం ఆగ్నేసమ్మకు రూ.1.40 లక్షలు, ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండ గ్రామానికి చెందిన మొగులూరు సుబ్బారావుకు రూ.2లక్షలు, జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామానికి చెందిన కొండేటి రామకృష్ణకు రూ.3 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయ్యాయి.వీటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ఆకాంక్షించారు. సీఎంఆర్ఎఫ్ నుంచి వెంటనే సాయం మంజూరు చేస్తున్న సీఎం చంద్రబాబుకి లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# వీరవల్లిలో రీసర్వే ప్రాజెక్ట్‌కు శ్రీకారం

**జనవరి 2 నుండి ప్రారంభం - రైతులకు పత్రాలు సిద్ధంగా ఉంచాలని సూచనలు**



**హనుమాన్ జంక్షన్, డిసెంబర్ 30 (మేజర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక రీసర్వే ప్రాజెక్ట్ భాగంగా వీరవల్లి గ్రామంలో జనవరి 2వ తేదీ నుండి రీసర్వే పనులు ప్రారంభం కానున్నాయి. దీనికి ముందస్తు ఏర్పాట్లను వివరించేందుకు మంగళవారం మధ్యాహ్నం వీరవల్లి సచివాలయం-2లో గ్రామసభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ సభలో వీరవల్లి గ్రామ ఆయకట్టు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని రీసర్వే ప్రక్రియపై వివరాలను తెలుసుకున్నారు. రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర మాట్లాడుతూ "ఇది గ్రామ అభివృద్ధికి, భూమి హక్కుల స్పష్టతకు ఎంతో అవసరమైన కార్యక్రమం. రీసర్వే ద్వారా భూముల సరిహద్దులు, రికార్డులు, పాత లోపాలు కొత్తగా సవరింపబడతాయి. ఎవరి భూమికి వారు పూర్తి హక్కుతో రికార్డు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందువల్ల అందరూ అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచి రీసర్వే బృందానికి సహకరించాలని కోరుతున్నాము" అని తెలిపారు. రైతులు భూమికి సంబంధించిన దస్తావేజులు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్, బ్యాంకు ఖాతా జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఫోన్ నంబర్ ఈ పత్రాలను గ్రామ సచివాలయంలో రెవెన్యూ అధికారికి అందించాల్సిన అవసరం ఉందని అధికారులు చెప్పారు. రాబోయే రోజుల్లో సర్వే బృందం గ్రామంలోని ప్రతి భూమిని పరిశీలించి, పక్కా రికార్డులను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా అనిత, గుండపనేని ఉమా వరప్రసాద్, ఉప సర్పంచ్ లంక అజయ్, ఎంపీటీసీ అమృతవల్లి సూర్యనారాయణ, ఈఓఫ్రోలు నళినీకాంత్, వీఆర్వో సునీల్ కుమార్, వీఆర్ఏ కోటేశ్వరరావు, పంచాయతీ ఈవో హరికృష్ణ, గ్రామ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో రీసర్వే పనులు విజయవంతంగా సాగుతాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

## అగ్నిప్రమాద బాధితులకు రావెళ్ల కృష్ణ ట్రస్ట్ సహాయం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం రామానగరంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన బాధిత కుటుంబానికి రావెళ్ల కృష్ణసేవాసమితి చైర్మన్ రావెళ్ల ఉదయకుమార్ ఆర్థికసహాయం అందించారు. ట్రస్ట్ అధ్యక్షుడు, డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్కుమార్ చేతులమీ దుగా రూ.5వేల ఆర్థికసహాయాన్ని బాధితులకు అందచేశారు. ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు మోర్ల శివ, తాతా ప్రదీప్, అమరనేని పెదరాజా పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ




**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని చీమలపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు చీమలపాడు పీఏసీఎస్ చైర్మన్ బెజవాడ శంకర్ అల్పాహారం ఏర్పాటు చేశారు. సాయంత్రం అదనపు తరగతులు చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఈ అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకొని ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు భూక్యా ఫక్రియా నాయక్, జిల్లా ఎస్టీ సెల్ నాయకులు బాణావత భీమా నాయక్, స్కూల్ చైర్మన్ షేక్ నాగుల్ మీరా, మండల మైనార్టీ అధ్యక్షులు షేక్ బాజీ, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు కొండపాటి సుబ్బారావు, టిడిపి గ్రామ కార్యదర్శి జంగా స్టాలిన్, తిరువూరు ఏఎంసి డైరెక్టర్ షేక్ కరీముల్లా, మాజీ మండలం మైనార్టీ అధ్యక్షులు ఎస్ కే ఆదం షరీఫ్, గ్రామ కోశాధికారి బెజవాడ ఆదిశేషు, ప్రధానోపాధ్యాయులు రాజులు పాటి హైమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎంపీని వినగడప రైతులతో కలిసిన ఐడిసి డైరెక్టర్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** తిరువూరు నియోజకవర్గం గంపలగూడెం మండలం వినగడప గ్రామ రైతులు ఎంపీ కేశినేని చిన్నిని మర్యాదపూర్వకంగా కలిశారు. వినగడప, అనుముల్ లంక పంప్ హౌస్ పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పైప్ లయన్ రిపేర్, మోటార్ రిపేర్ చెయ్యించాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ని రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని తో పాటు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. రబీ సీజన్ కు ఈ పంప్ హౌస్ లు చాలా ముఖ్యమని కావున త్వరగా చెయ్యించాలని కోరగా ఎంపీ కేశినేని చిన్ని సానుకూలంగా స్పందించారు, ఈ కార్యక్రమంలో గంపలగూడెం మండల పార్టీ అధ్యక్షులు మానికొండ రామకృష్ణ, ఎన్టీఆర్ జిల్లా రైతు అధ్యక్షులు మాచినేని రాజేశ్వరరావు, వినగడప నీటి సంఘం అధ్యక్షులు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## దీంటిమెరక అంబేద్కర్ యువసేన ఆధ్వర్యంలో మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు



**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరు ప్రధాన సెంటర్లో కృష్ణారావుగారి విగ్రహానికి మంగళవారం దీంటిమెరక గ్రామస్తులు మల్ల వెంకటేశ్వరరావు వాక రాజారావు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను సంవత్సరం పాటు నిర్వహించడం కొనసాగించడం చాలా ఆనందంగా ఉందని కూటమి నాయకులు అన్నారు.ఈ కార్యక్రమం లో కోడూరు మండల జనసేన పార్టీ, కోటమి నాయకులు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

## అచలేశ్వరుని దర్శించుకున్న మాజీ విప్ సామినేని



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ మాజీ విప్, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను మంగళవారం పాగోలులోని శ్రీకమలాత్మికా సహిత అచలేశ్వర స్వామివారిని దర్శిం చుకున్నారు. అచలాచల భోధోపదేశ మందిరంలో సహస్ర లింగాలను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ, ఎంపీటీసీ మేకా బంగారుబాబు, టీఎన్టీయూసీ రాష్ట్ర కార్యదర్శి చంద్రవెంకటేశ్వరరావులు ఉదయభానును సత్కరించారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి సొసైటీ అధ్యక్షుడు బొందల పాటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## వెంకన్నస్వామి సేవలో యార్లగడ్డ..



**గన్నవరం, డిసెంబర్ 30, మేజర్ న్యూస్ :** కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం ఉదయం తిరుమల చేరుకున్న యార్లగడ్డ వీఐపీ బ్రేక్ దర్శన వేళలో స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్రప్రజలు సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని, అభివృద్ధిలో మన రాష్ట్రం ముందంజలో ఉండాలని స్వామివారిని కోరుకున్నారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి స్వామి వారు తోడుగా ఉండాలని కాంక్షించారు.

## చల్లపల్లిలో విశేష పుష్పాలంకరణలో శ్రీవెంకటేశ్వరస్వామి

### వైభవంగా ముక్కోటి ఏకాదశి చల్లపల్లిలో బారులుతీరిన భక్తులు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని మంగళవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక శ్రీగరుడ ఆంజనేయ సహిత శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు ఉత్తర ద్వార దర్శనం కోసం బారులుతీరారు. పోలీస్ స్టేషన్ బజారు వరకూ భక్తులు బారులుతీరి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఉదయం నుంచీ మధ్యాహ్నం వరకు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు బృందావనం ధన్వం తరాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ, విశేష అర్చన, ధనుర్మాస ఉత్సవము, మంగళశాసనములు, తిరుప్పావైపాశుర విన్నపం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. ముక్కోటి సందర్భంగా దేవాలయాన్ని, ఉపాలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ పెద్దలు మోపిదేవి ద్వారకానాథ్, నూజెళ్ల బాబు, పత్రి హనుమంతరావు, ఉప్పాల ఏడుకొండలు, బొందలపాటి వెంకటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**శ్రీఆర్యవైశ్య సంఘ భవనం గీతామందిరంలో....**

గీతామందిరంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేముల శ్రీఆంజనేయ దం పతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం, విశేష పూజలు జరిగాయి. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి వరదా హరిగోపాల్, కొల్లిపర సాంబశివరావు, తమ్మన సతీష్కుమార్, ఉడత్తు సురేష్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. గోదాకృష్ణ భక్తబృందంచే విష్ణు సహస్రనామ పారాయణం జరిగింది.



# ముక్కోటి ఏకాదశి రోజున స్వామివారిని దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలం







**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠ ద్వారంగుండా ప్రవేశించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు.దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలకు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారిని కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తిరుమలలో ఫల పుష్ప ప్రదర్శనతో స్వామివారి నమూనా ఆలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను చక్క దిద్దుతూ ఈ ఏడాది ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ దర్శనం కల్పించడం శుభ పరిణామం అన్నారు.

# భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం





## స్వామివారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం మచిలీపట్నంలోని వివిధ దేవాలయాలలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. బచ్చుపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈరోజు వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారికి ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేసి భక్తులకు స్వామివారి దర్శనాన్ని కలగజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ముక్తేవి శశికాంత్ స్వామివారికి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ, పదవ కోర్టు ఏ డీజే బాబు నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి దేవుని దర్శనం చేసుకొని పూజల్లో పాల్గొన్నారు. మచిలీపట్నం మెయిన్ రోడ్ ఏం చేస్తున్న భద్రాద్రి రామాలయ దేవస్థానంలో వైకుంఠ ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు అలంకరణలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్యనిర్వాన అధికారి వై శిరీష,కే శ్రీనివాసరావు ఇన్స్పెక్టర్, కార్పొరేషన్ మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అర్చకులు గరిమెళ్ళ రామానుజ శ్రీకారచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మచిలీపట్నం మెయిన్ రోడ్ లోని శ్రీ రంగనాయక స్వామి దేవస్థానంలో మంగళవారం వైకుంఠ ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారిని ప్రత్యేక అలంకరణలు పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు.అనంతరం జరిగిన కోలాట ప్రదర్శనలో భక్తులు కోలాటాన్ని ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి గొర్రెపాటి. గోపీచంద్, మోటమర్రి. వెంకట బాబా ప్రసాద్, లోగిశెట్టి.వెంకటస్వామి, వందలాదిమంది భక్తులు విచ్చేసి స్వామివారి ఉత్తర ద్వార దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాన్ని కార్య నిర్వహణ అధికారి మాగపాటి సత్యప్రసాద్ బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



# ముక్కోటి వేడుకల్లో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ధనుర్మాసం సందర్భంగా మచిలీపట్నం మున్సిపల్ కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధనుర్మాస పూజ మహోత్సవంలో మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డంరాజు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సనాతన ధర్మాన్ని ఆచరించే హిందువులకు అత్యంత పవిత్రమైన రోజని ఈ రోజున మహావిష్ణువు మూడు కోట్ల దేవతలతో కలిసి భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తాడని భక్తుల విశ్వాసమని అందుకే దీనికి ముక్కోటి ఏకాదశి నామము వచ్చిందని మోక్షాన్ని ప్రసాదించే రోజుగా అమృతం పుట్టిన రోజుగ భగవద్గీత ఉపదేశించిన రోజుగ కూడా ప్రసిద్ధి చెందింది. మంగళవారం భక్తులు ఉపవాసాలు ఉండి భక్తితో ఉత్తర ద్వార దర్శనం చేసి తరిస్తారని అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలని, పంటలు సమృద్ధిగా పండి రైతులు ఆనందంగా ఉండాలని, ప్రజలందరికీ సుఖసంతోషాల తో ఆనందకరమైన జీవితాన్ని అందించాలని ఆ దేవదేవుని కోరినట్టు గడ్డం రాజు తెలిపారు.

# వైభవోపేతంగా వైకుంఠ ఏకాదశి





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** అత్యంత పవిత్ర పర్వదినమైన వైకుంఠ ఏకాదశి వేడుకలు గుడ్లవల్లేరు మండలంలోని డోకిపర్రు గ్రామంలోని శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఉదయం నాలుగు గంటలకు వేద పండితుల సమక్షంలో ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులతో పాటు పామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, పీ ప్రసన్న, వెంకటలక్ష్మి, కష్ణవేణి తదితరుల ద్వార పూజ అనంతరం భక్తులకు వైకుంఠ (ఉత్తర ) ద్వార దర్శనం కల్పించారు. అంతకు ముందు వేద పండితులు స్వామి వారికి అభిషేకం, పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు డోకిపర్రు మహాక్షేత్రంలో వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. ఉదయపు తొలి ఘడియల నుంచే భక్తులు గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠ ద్వారం వైపు నుంచి స్వామివారి దర్శనం చేసుకుంటే పాప విమోచనం కలిగి మోక్షప్రాప్తి కలుగుతుందన్న నమ్మకంతో భక్తులు అత్యంత భక్తితో దర్శనం చేసుకున్నారు. విశేష పుష్పాలంకరణతో శోభాయమానంగా దర్శనమిచ్చిన శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులకు అపూర్వానుభూతిని కలిగించారు. అర్చకుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నాదంతో ఆలయ ప్రాంగణం ఆకట్టుకుంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీ వీ కృష్ణారెడ్డి, సుధారెడ్డి పర్యవేక్షణలో ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందచేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా డోకిపర్రులో వైకుంఠ ద్వార దర్శనం పొందిన భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ పవిత్ర పర్వదినం సందర్భంగా స్వామివారి కపతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఐశ్వర్యం కలగాలని వేద పండితులు ప్రత్యేక పూజలు ఒనరించారు. అలాగే గుడ్లవల్లేరు శ్రీ రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామివారి ఆలయం, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయం, వడ్లమన్నాడు శ్రీ రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయం, కౌతవరం శ్రీ చెన్నకేశవాలయాల్లో స్వామివార్లు ఉత్తరముఖ ద్వారాన భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివార్లు పుష్పాలంకరణతో భక్తి తన్మయత్వంలో తేలియాడే విధంగా సర్వాలంకార శోభితులుగా భక్తులకు కనిపించారు. స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి, ఆలయాల ఎదుటనున్న రోడ్ల వెంబడి భారీ క్యూలైన్లుగా బారులు తీరారు. భక్తిప్రపత్తులతో భక్తులంతా స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా పలు దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం





**నాగాయలంక డిసెంబర్ 30 మేజర్ న్యూస్ :** భాద్రపద మాసం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా దీవి సీమ ప్రాంతంలోని పలు దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం మంత్రో చరణముల మధ్య అంగరంగ వైభవంగా జరిగినవి ఈరోజు కార్యక్రమంలో భాగముగా ఆ శ్రీ మన్నారాయణుడునకు భూమికి వచ్చిన పర్వదినం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా నాగాయలంక గ్రామంలోని సబ్బినేని వారి బజారులో గల రామాలయం వద్ద బ్రహ్మశ్రీ మురళీ ఆచార్యులు భక్తుల యొక్క గోత్రనామాలతో ఆ కలియుగ వైకుంఠనాథుని స్మరణముల మధ్య సీతారామ లక్ష్మణులు దేవస్థాన ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి అభిషేకములు చేయించి ఉత్తర ద్వార దర్శన భాగ్యము కల్పించినారు ఈ కార్యక్రమంలో నాగాయలంక చుట్టుపక్కల ప్రాంతవాసులు విచ్చేసి వారి వారి గోత్రనామాలతో పూజా కార్యక్రమాలు చేయించుకొని ఉత్తర ద్వార దర్శనం చేసి స్వామి వారి తీర్థప్రసాదము స్వీకరించి కార్యక్రమం జయప్రదం చేసినారు. ఈరోజు దివిసీమ ప్రాంతంలోని నాగాయలంక మండల పరిధిలోని గ్రామంలోని పలు దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి పల్లెపాలెం రామాలయం 6 వార్డు మంచినీటి చెరువు వద్ద గల రామాలయం, తిప్పాలెం రేమాలవారిపాలెం పేర్లంక గ్రామంలోని రామాలయంలో ఒక్క పట్ల వారి పాలెం నంగేగడ్డ సోర్లగొంది చోడవరం కమ్మవారిపాలెం ఏటి మొగ సంగమేశ్వరం కమ్మనమోల బరంకుల నాలి గణిపేశ్వరం బ్రహ్మయ్య మూల ఎదురు మెండి పలు దేవాలయాల నుండి విశేష పూజలు అందుకొని ఆ శ్రీ మన్నారాయణుడు దర్శన భాగ్యము కొరకు ఉత్తర ద్వార దర్శనం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి స్వామి వారిని వీక్షించి న భక్తులు అభిషేక కార్యక్రమాలు తీర్థప్రసాదాలు నైవేద్యంగా స్వామివారికి సమర్పించి విశేష పూజలు చేసినారు.

## ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోండి




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా రాణిగారితోట, కృష్ణలంక, స్క్యూ బ్రిడ్జ్ ప్రాంతాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి సందర్భంగా వివిధ ఆలయాలకు వెళ్తుంటారు కాబట్టి, వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సదుపాయం కల్పించేటట్టు అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. తదుపరి పద్మావతి ఘాట్ వద్ద పర్యటించి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, పద్మావతి ఘాట్ ను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తదుపరి కృష్ణలంక సాయిబాబా గుడి వద్ద ఉన్న అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ఎటువంటి లోపాలు ఉండరాదని మరమ్మతులను వెనువెంటనే పూర్తిచేయాలని. అన్న క్యాంటీన్ కు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు.

### కుటుంబ సమేతంగా తిరుమలేశుని దర్శనం



**మైలవరం మేజర్ న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారిని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నేడు మంగళవారం తిరుమలలో శాసనసభ్యులు కృష్ణప్రసాదు కుటుంబ సమేతంగా తిరుమలకు వెళ్లి శ్రీవారి సేవలో తరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ అందరికీ ముందుగా వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## గరుడ వాహనంపై కొలువుదీరిన వెంకటేశ్వరుడు



**కోడూరు మేజర్ న్యూస్ :** కోడూరూలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా ప్రారంభం అయ్యాయి ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచి బారులు తీరారు ఆలయ అర్చకులు దుంబాల శ్రీధరచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషా అర్చనలు పూజలు నిర్వహించారు.

## భక్తులతో కిటకిటలాడిన వైష్ణవాలయాలు



**మొవ్వ మేజర్ న్యూస్:** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజాము నుంచి మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో ఉత్తర ద్వార దర్శనంతో వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల కేంద్రమైన మొవ్వ శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయంలో నిర్వహించిన ఉత్తర ద్వార దర్శన వేడుకలు నయన మనోహరంగా సాగాయి. అధిక సంఖ్యలో తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరి ఉత్తర ద్వార దర్శనంతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హనుమాన్, వంశీ మోహన్లు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే కోసూరు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో భక్తులు బారులు తీరి ఉత్తర ద్వారం ద్వారా శ్రీ వేణుగోపాల స్వామి దంపతులను దర్శించుకున్నారు. అలాగే కూచిపూడి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ రాజగోపాల్ స్వామి మందిరంలో, పెదముత్తేవి శ్రీ లక్ష్మీపతి స్వామి దేవాలయంలో, శ్రీకృష్ణాశ్రమంలో మముక్షుజన మహా పీఠాధిపతి శ్రీ ముత్తేవి గౌరకృష్ణ గురుదేవుల పర్యవేక్షణలో కొనసాగిన శ్రీ వైకుంఠనాథస్వామి ఉత్తర ద్వార దర్శనం అనంతరం గో ప్రదక్షణ స్వామివారికి సహస్ర కమలార్చన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలో నిడుమోలు, కాజ, కొండవరం వేములమడ, మొవ్వ పాలెం, గూడపాడు, కూచిపూడి, బార్లపూడి, భట్ల పెనుమర్రు, పెదసనగల్లు, చిన ముత్తేవి, గ్రామాలలోని వైష్ణవాలయాలలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. అనంతరం దేవేరులను గ్రామస్తులు వేడుకలు నిర్వహించారు.





## కోసూరులో అగ్ని ప్రమాదం

మొవ్వ మేజర్ న్యూస్ : మండల పరిధిలోని కోసూరు గ్రామంలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో పెద్ది బోయిన సీతారామాంజనేయులుకు చెందిన నివాస గృహం పూర్తిగా అగ్నికి ఆహుతయ్యింది. దీంతో సీతారామాంజనేయులు కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు. అగ్ని ప్రమాదంలో రెండున్నరలక్షలఆస్తి నష్టం సంభవించిందని మొవ్వ అగ్నిమాపకాధికారి కే. వెంకటేశ్వర్ రావు తెలిపారు. అలాగే ఈ ప్రమాదంలోబాధితుడుకి చెందిన 83 వేల రూపాయల నగదు దగ్ధమైనట్లు ఆయన తెలిపారు.

## నాయి బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వరం

హనుమాన్ జంక్షన్, మేజర్ న్యూస్ : రాష్ట్ర నాయి బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం సమాజానికి ఆశాజ్యోతి వంటిదని రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం ప్రకటించింది. ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేసిన హామీని అమలు చేస్తూ ఇందుకు సంబంధించిన జీవో విడుదల చేయడం పట్ల సంఘాలు ఆనందం వ్యక్తం చేశాయి. ఈ పథకం ప్రకారం 200 యూనిట్ల వరకు విద్యుత్ బిల్లు చెల్లింపు నుంచి పూర్తిగా మినహాయింపు లభించనుందని, అర్హులైన నాయి బ్రాహ్మణులు తమ ప్రాంతంలోని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ల (ఏఇ) కార్యాలయాలకు దరఖాస్తులు సమర్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లిపర వరప్రసాద్ సూచించారు. ప్రజల భారాన్ని తగ్గించడమే కాకుండా, సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థల ఏర్పాటు ద్వారా మరింతగా ఉచిత విద్యుత్ ప్రయోజనాలు పొందేలా ప్రత్యేక సబ్సిడీ పథకం తీసుకురావాలని ప్రభుత్వం ముందడుగు వేయాలని వరప్రసాద్ డిమాండ్ చేశారు. నాయి బ్రాహ్మణులు సొంత ఇళ్లతో పాటు షాపులు, వ్యాపార స్థాపనలకూ ఈ పథకం వర్తించాలంటే సంబంధిత ఒప్పంద పత్రాలు, ఆధారాలు సమర్పించాలని కూడా సూచించారు. ఈ సందర్భంగా పథకం అమలు చేస్తూ సమాజానికి చేయూతనిస్తున్నందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పట్ల కొల్లిపర వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకునూరి కొండయ్య, నిడమోలు వెంకట సుబ్బారావు, రాయవరపు సూర్యనారాయణ శ్రీను, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు



నాగాయలంక డిసెంబర్ 30 మేజర్ న్యూస్ : నాగాయలంక గ్రామంలో వేంచేసి ఉన్న స్వర్గీయ మండలి. వెంకట కృష్ణారావు విగ్రహానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ద ప్రసాద్ నియోజకవర్గ యువ నాయకులు మండలి రాజాబాబు విచ్చేసి మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించినారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ దివిసీమ గాంధీ మండలి వెంకటకృష్ణారావు దివి సీమ ప్రాంత వాసులకు ఎనలేని సేవా కార్యక్రమాలు చేసేవారని ఆ మహానుభావుడి సేవా మార్గంలోనే వారి తనయుడు బుద్ధ ప్రసాద్ ప్రయాణించు చున్నారని సేవ చేసే మార్గం తండ్రికి మించిన, తనయుడిగా ఆదర్శవంతుడిగా బుద్ధ ప్రసాద్ నిలుస్తున్నారని ప్రజల పట్ల సేవా కార్యక్రమాలు సేవా నెరతి ఉన్న మహానుబావుడు తెలుగుబాషి భాష పైన అమితమైన ప్రేమ గల వ్యక్తి బుద్ధ ప్రసాద్ అని కొనియాడినారు తండ్రికి మించిన తనయుడుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రాంతానికే కాదు రాష్ట్రానికి గర్వకారణమని తెలియపరిచారు. జరిగిన కార్యక్రమానికి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జున్ (చిన్నబాబు) మెండు లక్ష్మణరావు, భోగాది సతీష్ మాదివాడ అర్జున్ రావు మెండు లక్ష్మణరావు రేమాల బాబూరావు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గుడివాక. శివాజీ,తలశిల రామ కృష్ణ (చౌదరిమాస్టర్) గుడివాడ శివరావు చెన్నగిరి రామ్మోహన్, పేర్ల.భీమే శ్వరరావు ముమ్మారెడ్డి సురేష్ తలశిల శివ శంకర్, తలశిల. రాఘవరావు షేక్ జానీ,సబ్బినేని.వెంకటేశ్వరరావు మర్రిపాలెం మాజీ సర్పం చ్ బండ్రెడ్డి బోసు ఒక్కపట్ల వారి పాలెం సర్పంచ్ శ్యాంప్రసాద్ సజ్జా శివ నాగే శ్వరరావు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మండలి వెంకటకృష్ణారావు అభి మాన సంఘ సభ్యులు కూటమి నాయకులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేసినారు.

# టీ.కొత్తపాలెంలో మండలి వెంకట కృష్ణారావు నూతన విగ్రహ ఆవిష్కరణ



నాగాయలంక డిసెంబర్ 30 మేజర్ న్యూస్ : నాగాయలంక మండలం టీ కొత్తపాలెం గ్రామపంచాయతీ పరిధిలో నూతనమ్మగా మండలి వెంకటకృష్ణారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్ప్ హాస్పటల్ రేపల్లె ఫోకస్ హాస్పిటల్ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ కృష్ణాజిల్లా గాంధీ క్షేత్రం కమిటీ చైర్మన్ మత్తి శ్రీనివాసరావు ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను చిలకలపూడి పాపారావు సి ఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ సేవా నెరతితో ప్రపంచవ్యాప్తంగా జేజేలు అందుకున్న మహానీయుడు గొప్ప నాయకుడు మండలి వెంకట క్రిష్ణారావు అని కొనియాడినారు. నూతన ముగా ఏర్పాటు చేసిన మండలి వెంకటకృష్ణారావు విగ్రహాన్ని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ విగ్రహ ఆవిష్కరణ చేసినారు టీ కొత్తపాలెం గ్రామ వాస్తవ్యులు బండ్రెడ్డి హరి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమం సందర్భంగా ఫోకస్ హాస్పిటల్ రేపల్లె పల్స్ హాస్పిటల్ వారి నేత్ర పరీక్ష శిబిరాలను ఎంపీ బాలసౌరి నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు సేవలను అతిథులు ప్రారంభించినారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథి ఏ.సురేష్ కుమార్ మాట్లాడుతూ మహనీయుడు లక్షణాలు వారసులకు రావటం అరుదుగా జరుగుతుందని మండలి వెంకట కృష్ణారావు కు ఉన్న సుగుణాలను ఆచరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ఆదర్శనీయమని కొనియాడినారు ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు, సామినేని.ఉదయభాను మాట్లాడుతూ సాంఘిక శాఖ మంత్రిగా ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో వసతి గృహాలు ఎస్సీ ఎస్టీ బీసీ కులాలలో వెలుగులు నింపిన మహానుభావుడని కొనియాడినారు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ 1957 లోనే ఈ ప్రాంతంలో మెటల్ రోడ్లు వేయించి తాగునీటి సౌకర్యం కల్పించిన మహనీయుడు ఎం వి కృష్ణారావు అని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఎమ్మెల్యేగా మంత్రిగా ఈ ప్రాంతానికి సేవ చేసినారు అని కొనియాడినారు తను గత టిడిపి ప్రభుత్వ హయాములో సిసి రోడ్లు వేయించి తాగు నీటిని సౌకర్యము కల్పించి యున్నానన్నారు నాగాయలంక ఆర్ అండ్ బి రోడ్డు నుండి టీ కొత్తపాలెం రోడ్ వేయించితిని అని త్వరలో పేర్ల వానిలంక నుండి టీ కొత్తపాలెం మధ్య ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిధులు చేస్తున్నట్లు గా తెలిపినారు. గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు మండలి వెంకట కృష్ణారావు విగ్రహం ఏర్పాటు చేసిన బండ్రెడ్డి హరి ని, సహకరించిన గ్రామస్తులను కొనియాడినారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి.వెంకటరామ్ (రాజాబాబు) చందు శ్రీనివాసరావు డి.సి చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జున్ రావు మండవ బాలవర్ధిరావు మెండు లక్ష్మణరావు (చినబాబు) పంచాయతీ సర్పంచులు,మండలి.ఉదయభాస్కర్ అంబటి శ్యాంప్రసాద్ దున్న.రాజేష్ ఎంపీటీసీ సభ్యులు కే వసంత్, పిఏసిఎస్ చైర్మన్లు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు తోట శ్రీనివాసరావు నాగాయలంక మండల తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ వివిధ గ్రామాల నుండి వచ్చిన మండలి వెంకట కృష్ణారావు శతజయంతి కమిటీ సభ్యులు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. తదానంతరం నిరుపేద ఎస్సీ ఎస్టీ కులాల వారికి వస్త్రధాన కార్యక్రమం నిర్వహించినారు వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి అన్ని రకముల టెస్టులు నిర్వహించి సదుపాయాలు కల్పించి రానున్న రోజులలో ఎన్నెన్నో సేవా కార్యక్రమాలు చేస్తామని తెలియపరచి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# ఏపిఎన్‌జిజిఓ అసోసియేషన్ కృష్ణాజిల్లా ఎన్నికలు

మచిలీపట్నం మేజర్ న్యూస్ : ఎ పి ఎన్ జి జి ఓ మచిలీపట్నంలో జరిగిన ఎన్నికలలో జిల్లా అధ్యక్షులుగా అకూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా సీతారామయ్య కోశాధికారిగా పీ.శోభన్ బాబు, మిగిలిన కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. ఈ ఎన్నికల నిర్వాహకులుగా గుంటూరు జిల్లాఏ పి ఎన్ జి జి ఓ అధ్యక్షులు గ్. శ్రీనివాసరావు ఎలక్షన్ ఆఫీసర్ గా,అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ గా రమేష్,ఏ పి ఎన్ జి జి ఓ ఎన్ టి ఆర్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర పరశీలకులుగా జానికి,ఏ పి ఎన్ జి జి ఓ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎలక్షన్ నిర్వహించారు.ఈ ఎలక్షన్ లో ఒకో పోస్ట్ కి ఒక నామి నేషన్ మాత్రమే సబ్మిషన్ జరిగినది,కావున జిల్లా కార్యవర్గం ఎన్నుకోబడినది అని ఎలక్షన్ అధికారి జి.శ్రీనివాసరావు ప్రకటించారు, సభను ఉదేశించి నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్షులు అకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులు నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని వొమ్ము చేయనని.ఉద్యోగులకు దగ్గరగా ఉంటూ సంఘ అభిరుద్ధికి కృషి చేస్తానని చెప్పినారు. నూతనంగా ఎన్నుకోబడిన జిల్లా కార్యదర్శి సీతారామయ్య మాట్లాడుతూ,ఎన్ జి జి ఓ హోమ్ నిర్మాణంలో నా శక్తి మేర కృషి చేస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు, నూతనంగా ఎన్నుకోబడిన కోశాధికారి పి. శోభన్ బాబు, మాట్లాడుతూ ఈ ఎన్నికలను పారదర్శకంగా ఎలక్షన్ ఆఫీసర్ నిర్వహించారాని చెప్పు అందుకు సహకరించిన అధ్యక్షులు అకూరి శ్రీనివాసరావుకి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని, ఆయన నాయకత్వాన్ని,ఉద్యగుల సమస్యల పరిష్కారానికి చేసే కృషిలో భాగస్వాములు ఉంటామని తెలియజేసారు.ఎ పి ఎన్ జి జి ఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉల్లి కృష్ణ పలువురు జిల్లా నాయకులు, వివిధ తాలూకాల ఎ పి ఎన్ జి జి ఓ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులు జిల్లా జాయింట్ కలెక్టర్ ని ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు.



# నూతన సంవత్సరానికి ప్రశాంత వాతావరణంలో స్వాగతం పలుకుదాం

## జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



మచిలీపట్నం మేజర్ న్యూస్ : జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, 2026వ సం.లో ప్రజలందరూ క్షేమంగా, సురక్షితంగా, సుఖసంతోషాలతో ఉండాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆకాంక్షించారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా బంధుమిత్రులతో ఆనందంగా వేడుకలు జరుపుకోవాలని, ఈ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాలలో నూతన విజయాలు, సంతోషాలు నింపాలని కోరారు. **నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా సూచనలు:** 2026 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా, నిబంధనలకు లోబడే వేడుకలు జరుపుకోవాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు సూచించారు. నూతన సంవత్సర వేడుకలలో పాల్గొనేవారు పోలీసు వారి యొక్క నియమ నిబంధనలు పాటిస్తూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో కేకులు కట్ చేయడం, అశ్లీల నృత్యాలు చేయడం, బహిరంగంగా పార్టీలు నిర్వహించడం, అనుచితమైన లేదా చట్టవిరుద్ధమైన కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో గుమిగూడటం, పెద్ద పెద్ద లౌడ్ స్పీకర్లు/డీజేలు వాడరాదు. హాస్పిటల్స్, వృద్ధాశ్రయాలు వంటి సున్నితమైన ప్రాంతాల్లో అధిక శబ్దంతో ప్రజా శాంతి భంగం చేయకుండా ఉండాలి. అంతేకాకుండా వేడుకల పేరుతో మందు గుండు సామాగ్రిని కాల్చడం ప్రదర్శించడం చేస్తే చర్యలు తప్పవు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసి ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, రేసింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. మద్యం మత్తులో డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి కార్యకలాపాలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే వారిపై, వారికి వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రుల పైన, వాహన యజమానుల పైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. నూతన సంవత్సరం సంబరాల సందర్భంలో డ్రంక్ %డ% డ్రైవ్ తనిఖీలు చేపట్టబడతాయని, అధిక మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామని తెలియజేశారు. డిసెంబర్ 3వ తేదీ సాయంత్రం నుండి జిల్లా మొత్తంలో పోలీసు పికెట్స్, గస్తీ బృందాలను ఏర్పాటు చేశారు.అన్ని ముఖ్య కూడళ్లలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, రోడ్డు ప్రమాదాలు లేదా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగింది.

**ప్రజల సహకారం:** నూతన సంవత్సర వేడుకలను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, వేడుకల పేరుతో నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం తప్పదని,జిల్లా ప్రజలందరూ స్థానిక పోలీసులకు సహకరించి, నూతన సంవత్సర వేడుకలను బాధ్యతాయుతంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు.

# రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ద్వారా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ద్వారా జిల్లాలో రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. మంగళవారం సాయంత్రం సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, పాత పత్రాల డిజిటలైజేషన్, రెవెన్యూ క్లినిక్ తదితర రెవెన్యూ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్లోని వారి చాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎం నవీన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం గురించి వివరించారు. కలెక్టరేట్లో సోమవారం 5 కౌంటర్లు ఏర్పాటు చేశామని, అందులో దరఖాస్తుల పరిశీలన, సలహా సూచనల విభాగము, 22-ఏ సమస్యలు, భూసేకరణ సంబంధిత సమస్యలు, ఆర్ఓఆర్ పట్టాదారు పాసుపుస్తకాలు, సుమోటో అడంగల్ కరెక్షన్ సంబంధిత సమస్యలు, రీ సర్వే, విస్తీర్ణం తేడా, జాయింట్ ల్యాండ్ పార్సల్ మ్యాప్ (ఎల్పిఎం) సంబంధిత సమస్యలు, ఇతర రెవెన్యూ సమస్యల విభాగాలతో కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి పలు అర్జీలు స్వీకరించి వాటిలో కొన్నిటిని పరిష్కరించినట్లు తెలిపారు. రానున్న కాలంలో కార్యక్రమాన్ని మరింత సమర్ధవంతంగా నిర్వహించి ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శికి తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పిపిపి విధానంలో అదనంగా 100 వైద్య సీట్లు



## సూపర్ సిక్స్ పథకాల అమలులో ముందడుగు..

## ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు..

**గన్నవరం, డిసెంబర్ 30, మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా పిపిపి విధానంలో నిర్మించనున్న 10 మెడికల్ కళాశాలల్లో పేద విద్యార్థులకు అదనంగా 100 సీట్లు లభిస్తాయని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. నూతన సంవత్సరం రాక సందర్భంగా గత 18 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను మంగళవారం యార్లగడ్డ పత్రికా ప్రకటనలో విలేకరులకు తెలియచేసారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ వైద్య కళాశాల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పిపిపి విధానాన్ని కేంద్ర ప్రభుత్వం సైతం సమర్ధించిందని, దేశరాజధాని ఢిల్లీలోనూ పిపిపి పద్ధతిలో వైద్య కళాశాల నిర్మిస్తున్నట్లు చెప్పారు. పిపిపి విధానంలో నిర్మించే వైద్య కళాశాలలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ ఉంటుందని ఈ విషయంలో ఏ విధమైన అపోహలకు తావులేదని తేల్చి చెప్పారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలను ఇప్పటికే తమ ప్రభుత్వం నెరవేర్చిందని, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ శక్తి పథకం కింద 3.25కోట్ల ప్రయాణాల ద్వారా రూ. 1,144 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు చొప్పున ఇప్పటివరకు దాదాపు రెండు కోట్ల సిలిండర్ల పంపిణీ చేశామని తద్వారా రూ. 2,684కోట్లు మహిళలకు ఆదా అయ్యిందన్నారు. 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం ద్వారా రూ. 10,090 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. రైతుల సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ పథకం కింద 46 లక్షల మంది రైతులకు రూ. 6,310 కోట్లు రైతులు ఖాతాలో జమ చేసినట్లు యార్లగడ్డ పేర్కొన్నారు. ఏడాది రికార్డు స్థాయిలో ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లో రైతులు ఖాతాలో నగదును జమ చేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా పొగాకు, మామిడి, కోకో, ఉల్లి పంటలకు 1,100 కోట్లు సాయంగా అందించినట్లు చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఏడాదికి రూ. 33 వేల కోట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులను ఆదుకునేందుకు మత్స్యకార భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.20 వేలు చొప్పున 1.25 లక్షల మందికి రూ. 250 కోట్లు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2004 అన్నా క్యాంటీన్ ద్వారా ఇప్పటివరకు నాలుగు కోట్ల భోజనాలు నామమాత్రపు ధరకు అందించినట్లు చెప్పారు. వీటితోపాటు పాస్టర్లు, ఇమామ్ లు, పురోహితులు, లాయర్లు తదితర అన్ని వర్గాల వారికి ఆర్థికంగా చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నట్లు యార్లగడ్డ వివరించారు. పోలవరం నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు రాజధాని అమరావతి లోనూ నిర్మాణ పనులు ఊపందుకున్న సంగతిని యార్లగడ్డ గుర్తు చేశారు. విశాఖపట్నం ను ఐటీ హబ్ గా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో ఇక్కడ గూగుల్ డేటా సెంటర్ తో పాటు టిసిఎస్, కాగ్నిజెంట్ వంటి పేరొందిన ఐటీ సంస్థలు విశాఖపట్నంలో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు వివరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మంత్రి లోకేష్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించేందుకు తొలిసారిగా పేరెంట్ టీచర్ మీటింగ్స్ ప్రవేశపెట్టినట్లు వివరించారు. రాష్ట్రానికి ఐటీ సంస్థలు రావడంలో మంత్రి లోకేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గత ప్రభుత్వ పాలనలో అస్తవ్యస్తంగా మారిన పంచాయతీరాజ్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నట్లు వెంకట్రావ్ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో పూర్తిపారదర్శక సేవలందించేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నట్లు యార్లగడ్డ తెలిపారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు పిలుపునిచ్చారు.

# లేబర్ కోడ్స్ రద్దు చేయాలి కార్మిక చట్టాలు సమగ్రంగా అమలు చేయాలి



**మైలవరం, మేజర్ న్యూస్:** సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ మైలవరం మండల కేంద్రంలో సిఐటియు కార్యాలయం నుండి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నది అన్నారు.కార్మిక హక్కులు, సంక్షేమంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమల రక్షణ కోసం పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు.కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తూ కార్మిక వర్గం అనేక త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆలోచనలో ఉంటే ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక అడుగు ముందుకు వేసి ఎనిమిది గంట పని విధానాన్ని మార్చి 10 గంటల పని పెంచి మహిళలు రాత్రి పూట పని చేసేందుకు అనుమతిస్తూ చట్టం చేసిందని ఇది కార్మికులను మరింత దోపిడీ చేయడానికి అవకాశం కల్పిస్తుంది అన్నారు. మహిళల రక్షణ లేకుండా పోతుందన్నారు. తక్షణమే లేబర్ కోడ్స్ ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు మధు శ్రీనివాసరావు, కార్యదర్శి సురేష్ బాబు, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్ విజయ్, పి కోటేశ్వరావు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపతిరావు, మారేశ్వర్ రావు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు లంక వెంకటేశ్వరావు, సిఐటియు మండల కమిటీ సభ్యులు ఎస్ ఇసాక్, రైతు సంఘం మండల కమిటీ సభ్యులు చిలుకూరి సుబ్బారెడ్డి, సిఐటియు మండల కమిటీ సభ్యులు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మండలంలోని కూరాడ మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు మంగళవారం స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని దాత ప్రశాంతి చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని గుడ్లవల్లేరు ఆర్సీఎమ్ చర్చి ఫాదర్ మాథ్యూ చేతుల మీదుగా నిర్వహించారు.

## ఎమ్మెల్యే వెనిగండ్లచే శ్రీ కొండలమ్మ క్యాలెండర్ల ఆవిష్కరణ



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :**మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థాన నూతన సంవత్సర క్యాలెండర్లను దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు (మోహన్), ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో మంగళవారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతుల మీదుగా ఆయన నివాసంలో ఆవిష్కరించారు. రాబోయే నూతన సంవత్సరంలో అమ్మవారి దీవెనలు అందరికీ ఉండాలని ఎమ్మెల్యే రాము ఆశించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వ రరావును వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## కోడి పందేలు కత్తుల తయారీకేంద్రంపై మెరుపు దాడి



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం అంబాపురం పైపుల రోడ్ ఒకటో వార్డ్‌లో టాస్క్ ఫోర్స్ ఏసిపి లలిత,సిఐ సుబ్రమణ్యం, విజయవాడ టూ టౌన్ ఎస్ఐ హరిప్రసాద్ వారితో కలసి సంయుక్తంగా రైడ్ జరిపి అంభాపురం గ్రామనివాసి శనగశెట్టి విజయ బాబు పండు, తండ్రి దుర్గా రావు,62 సం, వాని వద్ద నుండి రాబోయే సంక్రాంతి పండుగ నిమిత్తం సన్నద్ధం చేయుచున్న 500 కోడి పందెంలకు కట్టే కత్తులను, కోడి కత్తులు సాన పెట్టే మిషన్ ను స్వాధీనం చేసుకుని, అతని పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టడమైనది. ఇలాంటి సంఘటనలు మా దృష్టికి వచ్చిన,చట్ట వ్యతిరేక విధానాలను సహించబోమని చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వీధి కుక్కలకు ఏర్పాటు చేసిన ఆహార ప్రదేశము నిర్వహణకు జంతు ప్రేమికుల సహకారం అవసరం




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వీధి కుక్కలకు ఏర్పాటు చేసిన ఆహార ప్రదేశము నిర్వహణకు జంతు ప్రేమికుల సహకారం అవసరమని నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలో నూతన భవనం లోని సమావేశపు హాలులో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, జంతు ప్రేమికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏర్పాటుచేసిన వీధి కుక్కలకు ఆహారం పెట్టు ప్రదేశమునకు జంతు ప్రేమికుల సహకారం ఎంతో అవసరమని తెలియజేశారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి సచివాలయానికి ఒక ప్రదేశాన్ని వీధి కుక్కలకు ఆహారం పెట్టు ప్రదేశముగా గుర్తించి, ఏర్పాటు చేశారని. ఈ 286 డాగ్ ఫీడింగ్ జోన్లకు జంతు ప్రేమికులను మాపింగ్ చేస్తున్నామని. తద్వారా ప్రతి ఫీడింగ్ జోన్ కు జంతు ప్రేమికులు బాధ్యత వహించి ఈ ఫీడింగ్ జోన్లు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో వీధి కుక్కలకు ఆహారం పెట్టు ప్రదేశములలో ఏవైనా మార్పులు కావాలన్నా వారి సూచనలు ఖచ్చితంగా పరిగణంలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, జంతు ప్రేమికులు పాల్గొన్నారు.

# పున్నమితోట టీటీడీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ముక్కోటి



## వేలాదిగా తరలివచ్చిన భక్తులు



**విజయవాడ, మేజర్ న్యూస్ :** పున్నమితోటలోని టీటీడీ కళ్యాణ మండపంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామి వారి దర్శనం పొందేందుకు మంగళవారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా దేదీప్యమానంగా అలంకరించిన దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీసులు, టీటీడీ సిబ్బంది, సేవకు వచ్చిన స్వచ్ఛంధ కార్యకర్తలు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. వచ్చిన ప్రతీ భక్తునికి ప్రసాద వితరణ జరిగింది. మధ్యాహ్నం దాదాపు 10 వేల మందికి అన్నదాన కార్యక్రమం జరిగింది. జిల్లా అధికారులు, నగరంలోని ప్రముఖులు కూడా స్వామివారిని దర్శించుకునేందుకు దేవాలయానికి వచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ మల్లికార్జునరావు, ఇన్స పెక్టర్ రమాదేవి ఆలయ అర్చకులు మురళి, శశి, హేమంత్ ఆనంద్, నిర్వహకులు విజయ్ కుమార్, ప్రసాద్ ప్రసాద్ రెడ్డి, ఏడుకొండలు, సుబ్రహ్మణ్యం మహిళా భక్తులు శాంతి శ్రీ తులసి రాజేశ్వరి పాల్గొన్నారు.

# పులకరించిన కూచిపూడి





**మొవ్వ మేజర్ న్యూస్ :** కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో సంగీత విద్వన్ మణి బొక్క కుమారస్వామి జ్ఞాపకార్థం మంగళవారం నాట్య క్షేత్రం కూచిపూడిలో నిర్వహించిన 51వ కూచిపూడి నాట్య పతాక ఉత్సవంలో ప్రదర్శించిన నాట్యాంశాలుతో కూచిపూడి పులకరించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నాట్య గురువులతో పాటు ప్రవాస భారతీయురాలు (కెనడా) తమ శిష్యులతో కూచిపూడి శ్రీ సిద్దేంద్ర యోగి కళావేదికపై ప్రదర్శించిన పలునాట్యాంశాలు రసజ్ఞుల సైతం ప్రేక్షకులను అలరించాయి. హంసధ్వనికూచిపూడి నృత్యాలయ(విజయవాడ) వ్యవస్థాపకులు సిహెచ్ అజయ్ కుమార్ శిష్య బృందం, శ్రీ స్వరలయ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ (హైదరాబాద్) డైరెక్టర్ డాక్టర్ సౌజన్య రాజన్ శిష్యులు, త్రైలోక్య ఆర్ట్స్ అసోసియేషన్ (హైదరాబాద్) వ్యవస్థాపకురాలు ఇందిరా పరాశరం శిష్య బృందం, సాయినృత్య తరంగణి (హైదరాబాద్) కేఎన్ రాజేశ్వరిశ్రీధర్ శిష్యులు, కూచిపూడి నృత్యాలయ ఫౌండేషన్ (కెనడా) సుధా కామేశ్వరి శిష్య బృందం, పావని నరేంద్ర కళాక్షేత్రడాన్స్ అకాడమీ (విజయవాడ) పావని నరేంద్ర శిష్యులు ప్రదర్శించి అంశాలు అలరించాయి. తొలుత పతాక స్తూపం వద్ద నాట్య నిష్ణాతులు కేంద్ర సాంఘిక నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు, కళా రత్న లైనడాక్టర్ పసుమర్తి రామలింగ శాస్త్రి, డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, యక్షగాన కంఠీరవడాక్టర్ పసుమర్తి శేషుబాబు, బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారం అవార్డు గ్రహీతలు డాక్టర్ చింతా రవిబాలకృష్ణ,డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, పసుమర్తి మృత్యుంజయ శర్మ లతోపాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన నాట్యాచార్యులు, వారి శిష్యులు సమక్షంలో కూచిపూడి నాట్య పతాక స్థూపానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నాట్య ప్రదర్శనతో కళానీరాజనాలు అర్పించారు.



# కలంకారి క్లస్టర్ కి మున్సిపల్ పాలకవర్గం ఎప్పుడు వ్యతిరేకం కాదు




## జీరో అవర్లో కటకం, గరికిముక్కు, మెట్ల, స్పష్టం



**పెడన, మేజర్ న్యూస్ :** పురపాలక సంఘ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్పర్సన్ పటకం నాగకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ మేరకు ఎజెండాలో ఉన్న అన్ని అంశాలను పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మొదటగా కొత్తగా వచ్చిన కమిషనర్ను కౌన్సిల్కు పరిచయం చేస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అనంతరం ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కుటమీ ప్రభుత్వం ఇచ్చిన రెండు కోట్ల రూపాయలకు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు పై ఎజెండాలో పొందుపరిచిన అంశాలన్నీ ఆమోదం అయ్యాయి. అనంతరం జీరో ఆవరణలో కౌన్సిల్ సభ్యులు కటకం ప్రసాద్ మాట్లాడుతూ కలంకారి క్లస్టర్ పై తెలుగుదేశం పార్టీ నాయకులు బహిరంగ సభ ఏర్పాటు చేశారని ఆ సభలో కౌన్సిల్ సభ్యులు కలంకారి క్లస్టర్ కు అడ్డుపడుతున్నారనేది అవాస్తవమని అన్నారు. క్లస్టర్కు సంబంధించి స్థలాన్ని కేటాయించమనడం పేద మున్సిపాలిటీ ఉన్న స్థలాలను ఎలా ఇస్తామని ప్రశ్నించేమే కానీ క్లస్టర్ కు పాలకవర్గం ఏమాత్రం వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం క్లస్టర్ నిర్మాణానికి ప్రత్యేక స్థలం ఏర్పాటు చేస్తే సహకరిస్తామని పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ కూడా కౌన్సిల్దే తుది నిర్ణయం అని చెప్పటం జరిగిందని తెలిపారు. అనంతరం మరో కౌన్సిల్ సభ్యుడు చంద్రబాబు మాట్లాడుతూ కలంకారి క్లస్టర్ కు వైసిపి కౌన్సిల్ సభ్యులు అడ్డుపడుతున్నారని టిడిపి నాయకులు బహిరంగ సభలో చెప్పటం సరైనది కాదని చిత్తశుద్ధి ఉంటే పేదలకు బిపిఎల్ కోటాలో ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేయించింది టిడిపి నాయకులు కాదా అని ప్రశ్నించారు. కలంకారీ క్లస్టర్ నిర్మాణం జరగాలంటే ఎం ఎస్ ఎం ఈ ద్వారా నిధులు సేకరించి స్థలం కొని నిర్మించాలని అన్నారు. అంతేగాని పేద మున్సిపాలిటీ ఆస్తులను అన్యక్రాంతం చేయడం ఏమిటని ప్రశ్నించారు. క్లస్టర్ నిర్మాణానికి కౌన్సిల్ ఎప్పుడు అభ్యంతరం చెప్పలేదని చెప్పారు. కస్టర్కు అడ్డుపడుతున్నామని పదేపదే చెబుతున్న టిడిపి నాయకులు పేదలకు బిపిఎల్ కోటాలో ఇచ్చిన ఇళ్లపట్టాలను రద్దు చేయించింది మీరు కాదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు తదితరులు ఉన్నారు.

# ఎఫ్డీసీ జీఎంగా శ్రీనివాస నాయక్ బాధ్యతల స్వీకరణ



**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎఫ్టీవీటీడీసీ) జనరల్ మేనేజర్గా ఎం.శ్రీనివాస నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మేనేజర్గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస నాయక్కు జనరల్ మేనేజర్గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో శ్రీనివాస నాయక్ తాజాగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్లోగల ఎఫ్డీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్లో స్టెనోగ్రాఫర్గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన నాయక్ అంచెలంచెలుగా ఎదిగి జనరల్ మేనేజర్ స్థాయికి చేరుకున్నారు. జీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ గౌరవ సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు, ఎఫ్డీసీ ఎండీల సలహాలు సూచనలు మేరకు విధులు నిర్వర్తించి సంస్థ అభివృద్ధితో పాటు కళాకారుల సంక్షేమానికి అవసరమైన సేవలందిస్తానని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస నాయక్కు రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్తో పాటు ఫిల్మ్, టెలివిజన్, నాటకరంగ ప్రముఖులు నాయుడు గోపి, రాందాసు నాయుడు, బాలు, సింగర కొండయ్య చౌదరితో పాటు మేనేజర్ చల్లా శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ జ్యుడీషియల్ మెంబర్గా భాస్కర్ రెడ్డి వేమిరెడ్డి నియామకం



**విజయవాడ, మేజర్ న్యూస్ :** పన్ను చట్టాలలో అపార అనుభవం కలిగిన ప్రముఖ సీనియర్ అడ్వకేట్ భాస్కర్ రెడ్డి వేమిరెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ జ్యుడీషియల్ మెంబర్గా నియమితులయ్యారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెంచ్ జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్లో 2026 జనవరి 21న బాధ్యతలు స్వీకరించాలని ఆయనకు ఆదేశాలు జారీ అయ్యాయి. భాస్కర్ రెడ్డి వేమిరెడ్డి జ్యుడీషియల్ మెంబర్గా నియమితులవ్వడం వల్ల ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ పనితీరు మరింత బలోపేతం కానుంది. ఆయనకు ఉన్న అనుభవం, న్యాయపరమైన పరిజ్ఞానం, పన్ను చట్టాలపై ఉన్న లోతైన అవగాహన రాష్ట్రంలోని జీఎస్టీ వివాదాలను సమర్థవంతంగా, వేగంగా పరిష్కరించడానికి దోహదపడుతుందని బార్ అసోసియేషన్ సభ్యులు, భాగస్వాములు ధీమా వ్యక్తం చేశారు. భాస్కర్ రెడ్డి వేమిరెడ్డికి ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రంగంలో దాదాపు నాలుగు దశాబ్దాల న్యాయపరమైన అనుభవం ఉంది. ఆయన 1987లో న్యాయవాద వృత్తిని ప్రారంభించి, అప్పటి నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులతో పాటు వివిధ చట్టబద్ధమైన ట్రిబ్యునళ్లలో నిరంతరం ప్రాక్టీస్ కొనసాగిస్తున్నారు. పన్ను చట్టాలపై ఆయనకు ఉన్న అపారమైన జ్ఞానం, సంక్లిష్టమైన కేసులలో ఆయన ప్రదర్శించే వాదనల ద్వారా మంచి గుర్తింపు పొందారు. ఆయన గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 1993 నుండి 2004 వరకు స్పెషల్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్గా విశేష సేవలు అందించారు. ఆ సమయంలో ప్రభుత్వం తరపున పలు కీలక కేసులలో ప్రాతినిధ్యం వహించారు. ఆయన వృత్తిపరమైన నైపుణ్యం, న్యాయ రంగానికి అందించిన సహకారాన్ని గుర్తించిన తెలంగాణ హైకోర్టు, 2022లో ఆయనను 'సీనియర్ కౌన్సిల్'గా నియమించింది. ట్రిబ్యునల్ మెంబర్గా నియమితులు కాకముందు వరకు ఆయన సీనియర్ అడ్వకేట్గా, ముఖ్యంగా పన్ను వ్యవహారాలలో విజయవంతమైన ప్రాక్టీస్ కొనసాగించారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999